

## కడపను స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దుతాం : ఎమ్మెల్యే

**ప్రజాశక్తి - కడప అర్బన్**

'మన కడప-స్వచ్ఛ కడప' కార్యక్రమంలో భాగంగా ఐటిసి కంపెనీ ఆధ్వర్యంలో కడప నగరాన్ని స్వచ్ఛ కడపగా తీర్చిదిద్దే కార్యక్రమం ప్రారంభమైందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే మాధవి అన్నారు. శుక్రవారం వాలంటీర్లకు అందిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా భాగస్వామ్యంతోనే నగరాభివృద్ధి, స్వచ్ఛత సాధ్యమవుతాయని పేర్కొన్నారు. ఐటిసి వంటి సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని తెలిపారు. స్వచ్ఛత పట్ల ప్రతి పౌరుడూ బాధ్యతగా వ్యవహరిస్తే కడప మన రాష్ట్రంలోనే కాకుండా దేశంలోనే ఆదర్శ నగరంగా నిలుస్తుందని పేర్కొన్నారు. సమావేశంలో కడప మున్సిపల్ కమిషనర్ మనోజ్ రెడ్డి, పాలకొండరాయ స్వామి ఆలయ చైర్మన్ రెడ్డయ్య, టిడిపి కార్పొరేటర్ సుబ్బారెడ్డి, నాయకులు, అధికారులు, మెప్మా అధికారులు, వాలంటీర్లు, ఐటిసి సిబ్బంది పాల్గొన్నారు.

# జల దిగ్బంధం

**జిల్లాలో రెండు, మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కొన్ని ప్రాంతాలు జలదిగ్బంధంలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఎడతెరిపి లేని వర్షాల కారణంగా జనజీవనం స్తంభించి పోయింది. ప్రధాన రహదారులు కుంటలను తలపిస్తున్నాయి. ముఖ్యంగా ఇళ్లల్లోకి నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పాక్షికంగా గృహాలు దెబ్బతిన్నాయి. వర్షం ధాటికి గేదెల కొట్టంపై పైకప్పు కూలి మూడు మూగజీవాలు మృతి చెందాయి.**



మైదుకూరులోని ఓ కాలనీలో ఇళ్లలోకి చేరిన వర్షపు నీరు

- కుంటలను తలపిస్తున్న రహదారులు
- ఇళ్లల్లోకి చేరిన వర్షపు నీరు
- వర్షానికి కుంగిన రోడ్డు
- మృతి చెందిన మూడు గేదెలు
- పాక్షికంగా దెబ్బతిన్న గృహాలు



మైదుకూరు సంధ్యాల రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

**ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)**

మైదుకూరు మున్సిపాలిటీ జలదిగ్బంధంలో చిక్కుకుంది. మైదుకూరు మున్సిపాలిటీలో రోడ్డుమీద లోతట్టు ప్రాంతాల్లో ఎక్కడ చూసినా వర్షపు నీరు దర్శనమిస్తుంది. రోడ్లన్నీ పూర్తిగా జలమయమై, ప్రజల సాధారణ జీవనం స్తంభించింది. ప్రధాన రహదారులపై మోకాళ్ల లోతు నీరు నిలిచిపోవడంతో వాహనదారులతో పాటు పాదచారులు సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గురువారం రాత్రి పడిన అధిక వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. డ్రెయినేజీ కాలువలు పూర్తిగా నిండడంతో వర్షపు నీరు రోడ్లపైకి చేరింది. ముఖ్యంగా సంధ్యాల రోడ్లోని ఆనకుంట, కడప రోడ్డు నుంచి బస్టాండ్ వరకు, బద్వేల్ రోడ్లోని పలు వీధులు, చౌడేశ్వరి నగర్ వర్షపు నీటితో నిండిపోయింది. ఆనకుంటలో చెరువు నుంచి వచ్చే అలుగు నీరు అధికమై మొత్తం రోడ్డుపై ప్రవహిస్తుంది. కడప రోడ్లో ప్రధాన రహదారిపై ప్రవహిస్తూ బస్టాండులోకి చేరుతుంది. చౌడేశ్వరినగర్‌లో నీరు అధికమై గృహాలలోకి చేరింది. మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర కమిషనర్ రంగస్వామి తహశీల్దార్ రాజసింహ నరేంద్ర లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. అవకాశం ఉన్న ప్రాంతాల్లో వర్షపు నీరు సులభంగా ప్రవహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. చౌడేశ్వరి నగర్‌లో జెసిబి సహాయంతో వర్షపు నీరు ప్రవహించేందుకు చర్యలు చేపట్టారు. వర్షం వచ్చిన ప్రతిసారి లోతట్టు ప్రాంతాలు జలమయం అవుతున్నాయని అధికారులు శాశ్వత పరిష్కారం చూపడంలో విఫలమవుతున్నారని ప్రజలు పేర్కొంటున్నారు డ్రెయినేజీ కాలువలను వ్యర్థ పదార్థాలను తప్పకుండా తొలగిస్తే నీటి ప్రవాహానికి ఇబ్బంది ఉండదని పేర్కొంటున్నారు. కాలువలపై సిమెంట్ కట్టడాలు, అడ్డంకులు ఏర్పాటు చేసిన వారిపై చర్యలు తీసుకుని వాటిని తొలగిస్తే వర్షం వచ్చినప్పుడు ఇబ్బందులు ఉండవని సూచిస్తున్నారు. వర్షపు నీరు అధికంగా వచ్చి చేరడంతో దోమలు వృద్ధి చెంది ప్రజలు అంటు వ్యాధుల పట్ల పడే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు అధికారులు పూర్తిస్థాయిలో మున్సిపాలిటీ వ్యాప్తంగా పారిశుధ్య పనులు చేపట్టాలని కోరుతున్నారు.

### వర్షపు నీటితో ఇబ్బందులు పడుతున్నాం

వర్షపు నీరు రోడ్లపైన ప్రవహిస్తుండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. డ్రెయినేజీ కాలువలు సరిగా లేకపోవడంతో వర్షపు నీరు పూర్తిగా రోడ్లపైన ప్రవహిస్తుంది. వేసవిలో డ్రెయినేజీ కాలువలను పూడికతీత పనులు చేపడితే వర్షాకాలంలో సమస్య ఉండదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వర్షపు నీరు ప్రవహించేందుకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలి.

**- శివ, ఆనకుంట, మైదుకూరు.**

### వర్షపు నీరు ఇంట్లోకి వస్తోంది

రెండు రోజులుగా పడుతున్న వర్షానికి ఇంటి చుట్టూ నీరు చేరింది. గురువారం రాత్రి అధిక వర్షం పడటంతో నీరు పూర్తిగా ఇంట్లోకి వచ్చింది సాధారణ సమయాల్లో అధికారులు కాలనీలను ఏమాత్రం పట్టించుకోవడం లేదు. తాత్కాలికంగా నీటి తొలగింపుకు చర్యలు చేపడుతున్నారు. వర్షం వచ్చిన ప్రతిసారి ఇదే పరిస్థితి కొనసాగుతుంది. వర్షాకాలం ఇబ్బందులు ఏర్పడకుండా శాశ్వత పరిష్కారం చూపాలి.

**- వెంకటమ్మ, బద్వేల్ రోడ్డు, మైదుకూరు.**



మైదుకూరులో కుంటను తలపిస్తున్న ప్రధాన రహదారి

## జలమయమైన రహదారులు

**ప్రజాశక్తి- మైదుకూరు రూరల్**

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మైదుకూరు పట్టణం అతలాకుతలమైంది. రోడ్లన్నీ పూర్తిగా జలమయమై, ప్రజల సాధారణ జీవనం స్తంభించింది. ప్రధాన రహదారులపై మోకాళ్ల లోతు నీరు నిలిచిపోవడంతో వాహనదారులతో పాటు పాదచారులు సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో కాలువలు, డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతోనే వర్షం వచ్చిన ప్రతి సారీ రోడ్లపైనా, ఇళ్లల్లోకి నీరు వచ్చి చేరుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు కాల్వలోని పూడికను యుద్ధ ప్రాతిపదికన తొలగించి, కాల్వలపైన ఉన్న అక్రమ కట్టాడాలు తొలగించి శాశ్వత చర్యలు చేపడితే తప్ప సమస్య పరిష్కారం కాదని పేర్కొంటున్నారు.

## వర్షానికి కుంగిన జమ్మలమడుగు రోడ్డు

**ప్రజాశక్తి - ముద్దనూరు**



కుంగిన రోడ్డుకు అడ్డుగా పెట్టిన రాళ్లు

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు వంకలు పొంగి పొర్లుతున్నాయి. ముద్దనూరు జమ్మ లమడుగు రహ దారిలోని ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద ఉన్న బ్రిడ్జిపై వంక పారడంతో సగం రోడ్డు కుంగిపోయింది. వాహనాలు తిరగక పోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ దారిలో భారీ వాహనాలు తిరగడంతో రోడ్డు కొద్దిగా కుంగి పోయింది. శుక్రవారం వంక పారడంతో నీటి ప్రభావం ధాటికి రోడ్డు పూర్తిగా కుంగిపోయింది. దీంతో వాహనాల రాక పోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వాహనాలు తిరగకుండా అధికారులు రోడ్డుకు రెండు వైపులా కంప చెట్లు అడ్డుగా వేశారు. ముద్దనూరు నుంచి కర్నూలు, జమ్మలమడుగు వెళ్లే వాహనాలు, ప్రయాణికులు, వాహనదారులు మూడు కిలో మీటర్లు తిరిగి ఫ్లై ఓవర్‌పై రాకపోకలు సాగించారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు నాణ్యతగా చేపట్టాలని ప్రజలు,ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

## వర్షానికి మూడు గేదెలు మృతి

### - పాక్షికంగా దెబ్బతిన్న మూడు గృహాలు

**ప్రజాశక్తి - చాపాడు**



మృతి చెందిన గేదెలు

మండల పరిధిలో వరుసగా పడుతున్న వర్షాలకు మూడు గేదెలు మృతి చెందాయని, పలు గ్రామాలలో మూడు మట్టి మిద్దెలు కూలాయని తహశీల్దార్ రమా కుమారి తెలిపారు. సీతారామాపురం గ్రామంలో గురువారం రాత్రి పశువుల పాక కూలి మార్తాలా రాజేశ్వరమ్మకు చెందిన 3 గేదెలుమృతి చెందాయన్నారు. గేదెలను బండల చపట కలిగిన మట్టి మిద్దె పాకలో ఉంచారు. వరుసగా పడుతున్న వర్షానికి ఒక్కసారిగా కుప్ప కూలడంతో పశువులు మృతి చెందాయి. వీటి ధర ఒక్కొక్కటి రూ. ఒక లక్ష అవుతుందన్నారు. రైతులు పశు బీమా చేసుకోలేదని తెలిపారు. పాడి రైతులు ప్రభుత్వం సబ్సిడీతో అందుబాటులో ఉండే బీమా చేసుకోవడం వల్ల ఇలాంటి ఇబ్బందికర పరిస్థితుల్లో ఆర్థికంగా ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు.అలాగే రాజువారి పేటలో భూమిరెడ్డి వీరాంజనేయరెడ్డికి చెందిన మట్టిమిద్దె పాక్షికంగా వర్షానికి దెబ్బతినిందన్నారు. చియ్యపాడు గ్రామానికి చెందిన నల్లబోతుల చిన్నక్క, మిడుతూరు వెంకటసుబ్బమ్మల గృహాలు కూడా దెబ్బతిన్నాయన్నారు.ప్రభుత్వానికి నివేదిక పంపుతామని ఏదైనా అవకాశం ఉంటే రైతుకు లబ్ది చేకూరుస్తామని ఆమె తెలిపారు. బాధితులు ప్రభుత్వం తమను ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. మృతి చెందిన పశువులను పశువైద్యాధికారి మహమ్మద్ గౌస్, విఆర్‌ఓ రాజ శేఖర్ రెడ్డి పరిశీలించారు. పశువుల మృతి పట్ల ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని తెలిపారు.

## చెరువును తలపిస్తున్న బస్టాండ్ : సిపిఎం

**ప్రజాశక్తి-కాశినాయన (పోరుమామిళ్ల) :** రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పోరుమామిళ్లలో ఆర్ టిసి బస్టాండ్ చెరువును తలపిస్తోందని సిపిఎం మండల కార్యదర్శి ఎన్. భైరవ ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన పట్టణంలోని పలు ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్‌టిసి బస్టాండ్ మునిగి చాపల చెరువును తలపిస్తోందన్నారు. పోరుమామిళ్ల చెరువు నుంచి వంటకాలవలన్నీ మొత్తం కబ్జా చేసి భవనాలు నిర్మించుకోవడంతోనే వర్షపు నీరు రోడ్లపై వస్తున్నాయని పేర్కొన్నారు. వెంకటేశ్వర స్వామి ఆలయం ఎదురుగా పంట కాలవపైన దేశాయ్ చలపతి రెడ్డి, బాబుల్ రెడ్డి ఇరువురు కలిసి రేకులతో గదులు ఏర్పాటు చేసి అద్దెకు ఇచ్చారని చెప్పారు. ఇలాంటి వారి పైన కఠినంగా అధికారులు చర్యలు తీసు కోకపోవడం దారుణమన్నారు. శ్రీవెంకటేశ్వర ప్రయివేట్ హై స్కూల్ సమీ పంలో ఒక పెద్ద మురుగుకుంట లాగా తయారయిందని పేర్కొన్నారు. వెంటనే అధికారులు స్పందించి కాలువను పూడిక తీసి యథా విధిగా తయారు చేయాలని డిమాండ్ చేశారు లేని పక్షం అన్ని ఆఫీసుల ముందు పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం చేస్తామని ఆయన హెచ్చరించారు.

## కుంటను తలపిస్తున్న ఆరోగ్య కేంద్ర ముఖద్వారం

**ప్రజాశక్తి-కాశినాయన**



ముఖద్వారం వద్ద నిల్వ ఉన్ననీరు

రెండు, మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు మండల కేంద్రమైన నరసాపురంలోని ప్రధాన ఆరోగ్య కేంద్ర ముఖద్వారం కుంటను తలపిస్తూ రోగులకు, ఆరోగ్య, పోలీస్ సిబ్బందికి ఇబ్బందికరంగా మారింది. ఆరోగ్య కేంద్రం దశాబ్దాల కాలం నుంచి ఇక్కడ ప్రధానంగా మారింది. ఆరోగ్య కేంద్రానికి నిత్యంవందల సంఖ్యలో రోగులు వస్తుంటారు. ఇక్కడ ప్రధానంగా గర్భిణులకు సాధారణ డెలివరీలు కూడా అవుతున్నాయి. ఇక్కడే పోలీస్‌స్టేషన్ కూడా ఉండడంతో. ఆస్పత్రి ముఖ్య ద్వారంలో మోక లోతు నీళ్లు నిలవడంతో పోలీసులు ఇబ్బంది పడుతున్నారు. ఉద్యోగులు అయితే టూవీలర్లలో ఏదో విధంగా లోనికి వస్తున్నారు. రోగులు నీళ్లలో రాలేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. పలు పర్యాయాలుపంచాయతీ అధికారులకు తెలియజేసినా పట్టించుకునే నాథుడే లేరని స్థానికులు వాపోతున్నారు.

## రాచెరువులో అలుగు ఉధృతి

**ప్రజాశక్తి-గోపవరం :** మండలంలో ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా మడకలవారిపల్లె రాచెరువులో నీటి మట్టం గణనీయంగా పెరిగింది. అలుగు ఉధృతంగా పారుతోంది. అలుగు వద్ద భారీగా ముళ్ల కంప పెరిగి నీటి ప్రవాహానికి ఆటంకం కలుగుతోంది. ముళ్లకంప కారణంగా నీటి ప్రవాహం అడ్డంకిగా మారిందని, వర్షాలు ఇలాగే పడితే చెరువు నిండడంతోపాటు కట్ట దెబ్బతినే ప్రమాదముందని రైతులు పేర్కొంటున్నారు. తక్షణమే అలుగు వద్ద ఉన్న ముళ్లకంపను తొలగించి, చెరువు కట్టను బలపరచాలని అధికారులను కోరుతున్నారు. వర్షాల తీవ్రత కొనసాగితే చెరువు పరిసర ప్రాంతాల పంటలకు కూడా ప్రమాదం ముంచుకొస్తుందని పేర్కొంటున్నారు.

**చెరువులను పరిశీలించిన ఆర్‌డిఒ..** వర్షాల నేపథ్యంలో డివిజన్‌లోని బద్వేల్ పెద్దచెరువు, రాచెరువులను ఆర్‌డిఒ చంద్రమోహన్, ఇరిగేషన్ ఇఇ వేణుగోపాల్ రెడ్డి, బద్వేల్ తహశీల్దార్ ఉదయ్ భాస్కర్ రాజు, గోపవరం తహశీల్దార్ శ్రీ భువన్ రెడ్డితో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు చెరువుల నీటి మట్టం, కట్టలు, అలుగుల పరిస్థితులను ఆర్‌డిఒకు వివరించారు. వర్షాల తీవ్రత కొనసాగుతున్న నేపథ్యంలో చెరువుల వద్ద భద్రతా చర్యలు మరింత బలపరచాలని సంబంధిత అధికారులకు ఆయన ఆదేశించారు. చెరువుల వద్ద ముళ్లకంపలు, నీటి ప్రవాహానికి అడ్డంకులు వంటి సమస్యలు తక్షణమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

# యువత అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

### - డిఆర్‌ఒ విశ్వేశ్వరనాయుడు

**ప్రజాశక్తి - కడప**



విజేతకు బహుమతి, ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న డిఆర్‌ఒ

జిల్లా యువజన సర్వీస్ల శాఖ (స్టెప్) ఆధ్వర్యంలో శుక్రవారం కడప నగరంలోని స్పిరిట్స్ డిగ్రీ కళాశాలలో జిల్లా యువజనోత్సవాలు-2025 ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డిఆర్‌ఒ విశ్వేశ్వర నాయుడు మాట్లాడుతూ యువజన ఉత్సవాలలో యువత విరివిగా పాల్గొని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్టెప్ ముఖ్య కార్యనిర్వహణాధికారి జోయెల్ విజయకుమార్ ఇండ్ల మాట్లాడుతూ యువజోత్సవాలు స్వామి వివేకానందుని జయంతి పురస్కరించుకొని జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలలో నిర్వహిస్తారని తెలిపారు. కడప డివిజన్ ఆర్‌డిఒ జాన్ ఎర్విన్ మాట్లాడుతూ యువతకు చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలలో కూడా పాల్గొనడం వలన మానసిక ఉల్లాసం కలుగుతుందని కొనియాడారు. స్పిరిట్స్ కళాశాల డైరెక్టర్ రవీంద్ర మాట్లాడుతూ స్టెప్ ఆధ్వర్యంలో ఈ యువజనోత్సవాలు తమ కళాశాల లో నిర్వహించడం ఆనందదాయకమని అన్నారు.జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ సురేష్ కుమార్ మాట్లాడుతూ యువత ఇటువంటి కార్యక్రమాలలో పాల్గొని తమలోని ప్రతిభను వెలికి తీయడానికి ఇది మంచి తరుణమని అన్నారు. యువజనోత్సవాలలో దాదాపు 485 మంది జిల్లా నలుమూలల నుంచి వివిధ పోటీలలో పాల్గొన్నారు.



కట్టపై ఒరిగిన స్కూల్ బస్సు

## చెరువుకట్టపై అదుపు తప్పిన స్కూల్ బస్సు

### - 60 మంది విద్యార్థులకు తప్పిన పెను ప్రమాదం

**ప్రజాశక్తి - గోపవరం**

మండలంలోని సంద్రపల్లి చెరువుకట్టపై స్కూల్ బస్సు అదుపు తప్పింది. డ్రైవర్ అప్రమత్తతో సుమారు 60 మంది విద్యార్థులకు పెను ప్రమాదం తప్పింది. వివరాలు.. మహేశ్వర్‌రెడ్డి స్కూలు బస్సు చెరువుకట్టపై వెళ్తుండగా వర్షానికి రోడ్డు నానడంతో సైడ్‌కు వాలిపోయింది. డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించి వెంటనే బస్సు ఆపి, స్థానికుల సాయంతో విద్యార్థులను సురక్షితంగా కిందకు దించాడు. దీంతో విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు. డ్రైవర్ అప్రమత్తంగా ఉండకుండ ఉంటే బస్సు చెరువులో పడే ప్రాణనష్టం సంభవించేదని స్థానికులు పేర్కొన్నారు. అప్రమత్తంగా వ్యవహరించిన డ్రైవర్ చాకచక్యంతో పెద్ద ప్రమాదం తప్పిందని తెలిపారు.

## కర్నూలు బస్సు దుర్ఘటన దురదృష్టకరం : పిసిసి

**ప్రజాశక్తి - వేంపల్లె**

కర్నూలు జిల్లా కల్లూరు మండలం, చిన్నటేకూరు వద్ద శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం దురదృష్టకరమని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ హైదరాబాద్ నుండి బెంగళూరు వెళ్తున్న వేమూరి కావేరి ట్రావెల్స్ ప్రయివేట్ బస్సు దగ్ధమై 20 మంది ప్రయాణికులు సజీవ దహనం కావడం బాధాకరమని చెప్పారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు గాయపడిన, మృతి చెందిన కుటుంబాలకు అటు ప్రభుత్వం, ఇటు బస్సు యాజమాన్యం ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. మృతుల కుటుంబాలకు తులసిరెడ్డి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

**పటిష్టమైన తనిఖీలు నిర్వహించాలి : డివైఎఫ్ఐ**

**ప్రజాశక్తి కడప అర్బన్ :** హైదరాబాద్ నుంచి బెంగుళూరు వెళుతున్న ప్రయివేట్ ట్రావెల్స్ బస్సు కర్నూలు వద్ద అగ్ని ప్రమాదానికి గురై పలువురు ప్రయాణికులు మరణించడం బాధాకరమని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ పేర్కొన్నారు. మరణించిన వారికి ప్రగాఢ సంతాపం ప్రకటిస్తున్నట్లు పేర్కొన్నారు. గాయపడిన వారికి అత్యవసర చికిత్స అందించి ఆదుకోవాలని తెలిపారు. హైవేలలో ప్రమాదాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు జిల్లా లో ప్రయివేటు ట్రావెల్స్ యాజమాన్యాలు నిబంధనలు పాటించనివి చాలా వరకు ఉన్నాయని పేర్కొన్నారు. రవాణా శాఖ అధికారులు ప్రయివేటు ట్రావెల్స్‌ను తనిఖీలు నిర్వహించాలని తెలిపారు.

**బస్సు దగ్ధం ఘటన విచారకరం : సిపిఎం**

హైదరాబాద్ నుంచి బెంగుళూరు వెళుతున్న ప్రయివేట్ ట్రావెల్స్ బస్సు కర్నూలు వద్ద అగ్ని ప్రమాదానికి గురై పలువురు ప్రయాణికులు మరణించడం బాధాకరమని సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మరణించిన వారికి ప్రగాఢ సంతాపం తెలిపారు. గాయపడిన వారికి అత్యవసర చికిత్స అందించి ఆదుకోవాలని పేర్కొన్నారు. హైవేలలో ప్రమాదాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలను మానవతా దృక్పథంతో ఆదుకోవాలని పేర్కొన్నారు.

**మృతులకు అరకొర సాయం**

**కడప :** కర్నూలులో బస్సు దగ్ధమైన ఘోర ప్రమాదంలో సజీవ దహనమైన 19 మంది మృతుల కుటుంబాలకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కేవలం రూ. 2 లక్షలు మాత్రమే ఎక్స్‌గ్రేషియా ప్రకటించడం అరకొర సాయమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ పేర్కొన్నారు. క్షతగాత్రులకు కూడా కేవలం అత్యంత స్వల్పంగా రూ. 50 వేలు మాత్రమే ఇవ్వడాన్ని తప్పుపట్టారు. **బస్సు ప్రమాదం బాధాకరం**.. బస్సు దగ్ధమైన ఘటనపై మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా తీవ్రదిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. హైదరాబాద్ నుండి బెంగళూరు వెళ్తున్న వేమూరి కావేరి ట్రావెల్స్ వోల్వో బస్సు కర్నూల్ జిల్లా కల్లూరు మండలం ఉల్లిందకొండ క్రాస్ దగ్గర బైక్‌ను ఢీకొని మంటలు చెలరేగి దగ్ధమైన ఘటన తీవ్ర విచారకరమన్నారు

## బుగ్గవంక నుంచి చెరువులకు నీరు విడుదల

**ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె :** మండలంలోని బుగ్గవంక ప్రాజెక్టు నుంచి 500 క్యూసెకుల నీటిని చెరువులకు శుక్రవారం కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో సకాలంలో వర్షాలు కురిసి అన్నిచోట్ల నీరు సమృద్ధిగా ప్రవహిస్తుందని పేర్కొ న్నారు. వ్యవసాయానికి, ప్రజల తాగునీటికి ఎలాంటి ఇబ్బంది ఉండదని పేర్కొన్నారు. రైతులకు ఎటువంటి సమస్యలున్న ముందుండి వాటిని పరిష్క రిస్తానని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, మోహన్ బాబు, భాస్కర్ రెడ్డి, ఓబుల్ రెడ్డి,సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

## నాణ్యత లోపించకుండా చిరుధాన్యాల నిల్వ

**ప్రజాశక్తి - కడప అర్బన్ :** పప్పు దినుసులు, చిరుధాన్యాల నాణ్యత లోపించకుండా నిల్వ ఉంచుకోవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్ తెలిపారు. శుక్రవారం జిల్లాలోని సహాయ వ్యవసాయ సంచాలకులు, మండల వ్యవసాయ అధికారులకు జాతీయ ఆహార భద్రత, పోషణ మిషన్ ద్వార పప్పు దినుసులు, చిరు ధాన్యాల పంట నిలువ సామర్థ్యం పెంపొందించే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ రబీ 2025 - 26 సీజన్‌కు గాను 25 శాతం సబ్సిడీతో శనగ విత్తనాల పంపిణీ చేస్తారన్నారు. ఈ నెల 26 నుంచి 28 వరకు మాత్రమే రిజిస్ట్రేషన్ చేయాలని తెలిపారు. అదే సమయంలో క్యూఆర్ కోడ్ పద్ధతి ద్వారా మాత్రమే రైతులు డబ్బులు చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. రిజిస్ట్రేషన్ పూర్తయిన తరువాత శనగల పంపిణీ చేయాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. శనగ విత్తనాల నమోదును ప్రతి రైతు వినియోగించుకుని సబ్సిడీ విత్తనాలు తీసుకోవాలని కోరారు.

## నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

**ప్రజాశక్తి - కడప అర్బన్ :** జిల్లాలో తుపాను కారణంగా భారీ వర్షాలు కురవడంతో పెన్నా, పాపాగ్ని, కుందూ నది పరివాహక ప్రాంతాల్లో చేతికొచ్చిన వరి, ఇతర పంటలు నష్టం పోయిన రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలని సిపిఎం నగర కార్యదర్శి ఎ. రామమోహన్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరి రెడ్డి కోరారు. శుక్రవారం ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితి సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జిల్లా వ్యవసాయ శాఖ అధికారుల లెక్కల ప్రకారం 16 మండలాల పరిధిలో 71 గ్రామాలలో 2711 హెక్టార్లలో వ్యవసాయ పంటలు దెబ్బతిన్నట్లు ప్రకటించారన్నారు. ఇందులో వరి పంట 1971 హెక్టార్లలో , మొక్కజొన్న 41 హెక్టార్లలో, కంది 258 హెక్టార్లలో, మినుము 228 హెక్టార్లలో, వేరుశనగ 134 హెక్టార్లలో, పత్తి 81 హెక్టార్లలో వర్షపు నీరు నిల్వ వల్ల దెబ్బతిన్నాయన్నారు. వాస్తవంగా క్షేత్రస్థాయిలో ఇంకా ఎక్కువగా పంటలు నష్టపోయినట్లు తెలుస్తుందన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు గ్రామీణ ప్రాంతాల్లో పర్యటన చేస్తే ఇంకా ఎక్కువ సమాచారం వచ్చే అవకాశం ఉందన్నారు. దెబ్బతిన్న వరి, మొక్కజొన్నను ప్రభుత్వమే మార్క్ ఫేడ్ ద్వారా కొనుగోలు చేయాలని పేర్కొన్నారు. వర్షం కారణంగా కూలిన మట్టి మిద్దెల స్థానంలో హౌసింగ్ స్కీం ద్వారా ఇంటి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి నష్టపోయిన రైతాంగానికి అన్ని విధాలుగా ఆదుకోవాలని పేర్కొన్నారు.

## విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

**ప్రజాశక్తి - కడప అర్బన్ :** ఎస్‌పి షెల్కె నచికేత్ విశ్వనాథ్ ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా పోలీసులు శుక్రవారం వివిధ పాఠశాలలలో వ్యాసరచన పోటీలు, అవగాహన సదస్సులు నిర్వహించారు. అమరవీరుల వారోత్సవాలలో భాగంగా జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ పరిధులలోని పలు విద్యా సంస్థలలో, పాఠశాలలో 'లైంగిక నేరాల నుంచి మహిళలు, పిల్లల రక్షణలో విద్యార్థుల పాత్ర"అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా నిర్వహించామని పోలీసు అధికారులు చెప్పారు. ఇందులో మంచి ప్రతిభ కనబర్చిన వారికి ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేయనున్నారు. అనంతరం విధి నిర్వహణలో ప్రాణాలని త్యాగం చేసి అమరులైన పోలీసుల త్యాగాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే కడప నగరంలోని పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో పోలీసు సిబ్బందికి శుక్రవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జిల్లాలోని ఎఆర్, సివిల్ విభాగం లోని కానిస్టేబుల్ నుంచి ఎస్ఐ స్థాయి వరకు సిబ్బంది పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పోలీస్ సిబ్బందికి ' నేటి కాలంలో పోలీసుల విధినిర్వహణలో సాంకేతిక పరిజ్ఞానం పాత్ర' అనే అంశంపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు.

## దృఢ సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోంది

### - టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి

**ప్రజాశక్తి -జమ్మలమడుగు**



మాట్లాడుతున్న భూపేష్‌రెడ్డి

కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో దృఢ సంకల్పంతో పని చేస్తుందని జమ్మలమడుగు నియోజకవర్గ ఇన్‌ఛార్జి చదిపిరాల భూపేష్ సుబ్బరామిరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజా సంక్షేమంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలకు ముందుకు వెళుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, యువ నాయకుడు నారా లోకేష్ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు నెరవేర్చడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. విశాఖ పట్నంలోని గూగుల్ డేటా సెంటర్ రాష్ట్రానికే తలమానికం అన్నారు. అనం తరం 76 మంది లబ్ధిదారులకు రూ.40. 46 లక్షలు విలువ చేసే ముఖ్య మంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో చిన్నకొమెర్ల రామంజనేయరెడ్డి, పొన్నతోట శ్రీనివాసులు, మల్లికార్జున, దువ్వూరు మురళి, చిన్నకొమెర్ల రామాంజల్ రెడ్డి, ఎన్‌డిఎ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పెన్షనర్ల సమస్యలు పరిష్కరిస్తాం

**ప్రజాశక్తి- కడప అర్బన్**

పెన్షనర్ల సమస్యలు సత్వరమే పరిష్కరిస్తామని జెఎసి చైర్మన్, ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు అలపర్తి విద్యాసాగర్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు శుక్రవారం ఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.వి.రమణ, కార్యనిర్వాహక కార్యదర్శి జగదీష్, వైస్ ప్రెసిడెంట్ శివ కృష్ణను మర్యాదపూర్వకంగా కలిశారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రామమూర్తి నాయుడు, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసులు, తుపాకుల నారాయణ, బి.ఎస్. విజయ్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు చెంచు రెడ్డి, కోశాధికారి నూనె నగేష్, నాగరత్నాచారి, సుభాన్, కార్యదర్శులు రాష్ట్ర నాయకులను దుశ్శాలువా, బొకేలతో సత్కరించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ 7 నుంచి 10 శాతం, 15 శాతం పెంచడానికి అన్ని విధాల కృషి చేస్తానని తెలిపారు.




సమావేశంలో మాట్లాడుతున్న డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు చిన్ని

## ఆర్ఎంపి క్లినిక్‌లపై తనిఖీలు శూన్యం : డివైఎఫ్ఐ

**ప్రజాశక్తి - బద్వేలు**

అట్లూరు మండలంలో దాదాపు 13 చోట్ల నిబంధనలకు వ్యతిరేకంగా ఆర్ఎంపి క్లినిక్‌లు నడుస్తున్నాయని వాటిపైన జిల్లా అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం అట్లూరు మండల కేంద్రంలో డివైఎఫ్ఐ జిల్లా నాయకులు విజయ్, ఉదయ్ కుమార్‌లతో కలసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్ని మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎటువంటి అర్హత లేకుండానే డాక్టర్ల పేరుతో ఆర్ఎంపి క్లినిక్‌లు మండలంలో 13 మంది పైబడి నిర్వహిస్తూ ప్రజలకు వైద్యం చేస్తున్నారు. వారు కేవలం ప్రాథమిక చికిత్స మాత్రమే చేయాలని, అలాగాక ఇంజక్షన్లు, సెలైన్‌బాటిల్ ఎక్కించడం వంటివి ఇస్తూ మందులు రాస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని, ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇంటిలోనే మెడికల్ షాపు నిర్వహిస్తూ వైద్యం చేస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి వారి పైన వైద్యశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించి వారి పై కేసులు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. పేద మధ్యతరగతికి చెందిన ప్రజలు ఖర్చు తగ్గుతుందని వారి దగ్గరికి వెళ్తే ఇదే అదునుగా చూసి డోస్ ఎక్కువ ఉన్నటువంటి ఇంజక్షన్ వేసి వారి దగ్గర ఉన్నటువంటి డబ్బులను కాజేస్తున్నారని వారు తెలిపారు. చిన్నపాటి జ్వరానికి టెస్టుల పేరుతో డయాగ్నస్టిక్స్ సెంటర్లతో ముందుగానే కమీషన్ మాట్లాడుకొని వేలకు వేల రూపాయలు డబ్బులు గుంజుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా జిల్లా వైద్య శాఖ అధికారులు క్లినిక్ సెంటర్‌లపై తనిఖీలు నిర్వహించి నిబంధనలు పాటించకుండా నడుస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో డివైఎఫ్ఐ యువజన సంఘం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని వారు తెలియజేశారు.



రికార్డులు తనిఖీ చేస్తున్న మానిటరింగ్ అధికారి నాగశశిభూషణ్‌రెడ్డి

## ఆరోగ్య కేంద్రాల్లో రికార్డుల తనిఖీ

**ప్రజాశక్తి - చాపాడు**

మండల పరిధిలోని లక్ష్మీపేట, బద్రిపల్లె గ్రామాలలోని ఆరోగ్య కేంద్రాలలోని అన్ని రకాల రికార్డ్‌లను శుక్రవారం జిల్లా ప్రోగ్రాం మానిటరింగ్ అధికారి నాగశశిభూషణ్‌రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య సిబ్బంది ఆరోగ్య సేవలు, అంతర్జాలంలో నమోదు ప్రక్రియ, ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, వైద్య సిబ్బంది నైపుణ్యతను పరిశీలించాన్నారు. కౌమార దశలో ఉన్న బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించే విధంగా చేయాలన్నారు. రక్త హీనత లేకుండా ఐరన్ పోలిక్ మాత్రలు అందజేయాలని సిబ్బందికి సూచనలు చేశారు. జిల్లా గణాంక అధికారి రమేష్ రెడ్డి మాట్లాడుతూ గర్భిణులకు, బాలింతలకు అందిస్తున్న సేవల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి గర్భిణి, బాలింతల వివరాలను అంతర్జాలంలో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామ్ అధికారి నారాయణ, డిపిహెచ్ ఎన్.శాంతిలత , జిల్లా ఎంఐఎస్ అధికారి రాజశేఖర్, ఆరోగ్య విస్తరణ అధికారి ఎం.రాఘవయ్య, ఆశా నోడల్ పర్సన్ సుకన్య, సూపర్ వైజర్లు టి.ప్రసాద్, భవాని, లక్ష్మీదేవి, బాబురెడ్డి, ఎంఎల్ హెచ్ పిలు, ఎఎన్ఎంలు, ఆశా అంగన్వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.



దుకాణ యజమానులతో మాట్లాడుతున్న ఎంపిడిఒ

## పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

**ప్రజాశక్తి - వేముల**

స్థానిక బస్టాండ్‌లోని ప్రతి ఒక్కరూ దుకాణాల వద్ద పరిశుభ్రంగా ఉంచుకోవాలని, లేని పక్షంలో జరిమానాలు విధిస్తామని ఎంపిడిఒ గంగాదేవి దుకాణాల యజమానులను హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారి సమీపంలో ఉన్న దుకాణాలను ఆమె శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పలు దుకాణాల వద్ద ఉన్న చెత్తాచెదారాన్ని గమనించిన ఆమె వెంటనే చెత్తను తొలగించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ పరిసరాల ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని, చెత్తాచెదారులు నిల్వ ఉండడం వల్ల వ్యాధులు వ్యాప్తి చెందుతాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ దుకాణాలవద్ద చెత్తకుండీలను ఏర్పాటు చేసుకొని అందులో చెత్త వేసుకోవాలని లేనియెడల జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.

## కండిషన్ లేని బస్సులను పక్కన పెట్టాలి

**ప్రజాశక్తి - జమ్మలమడుగు :** కండిషన్ లేని బస్సులు పక్కన పెట్టాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ అన్నారు. శుక్రవారం జమ్మలమడుగు డిపోకు చెందిన సూపర్ లగ్జరి బస్సు జమ్మలమడుగు నుంచి కడపకు బయలు దేరిందని, బస్సు కండిషన్ సరిగ్గా లేకపోవడంతో ప్రొద్దుటూరు రోడ్డు మార్గాన ఆగిపోయిందని అన్నారు. నిత్యం ప్రజలు సుదూర ప్రాంతాలకు ప్రయాణాలు సాగించే క్రమంలో బస్సులు కండిష్‌లో ఉండాల్సిన అవసరం అధికారులకు ఉందని పేర్కొన్నారు. అధికారుల నిర్లక్ష్యంతో బస్సులు ఆగిపోయే పరిస్థితి నెలకొందని అన్నారు. ఇప్పటికైనా అధికారులు బస్సు బయలుదేరే ముందు కండిషన్ చెక్ చేసి సర్వీసు రూటుకు పంపించాలని పేర్కొన్నారు. ఇటువంటి సంఘటన భవిష్యత్‌లో పునరావృతం కాకుండా చూడాలన్నారు.

## ముగ్గురికి జైలు శిక్ష, జరిమానా

**ప్రజాశక్తి-కలసపాడు**

మద్యం సేవించి వాహనాలు నడిపిన ముగ్గురికి జైలు శిక్ష, జరిమానా విధించినట్లు ఎస్ఐ థిమోతి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఇటీవల కలసపాడు పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించగా మోనుకుమార్ , సయ్యద్ సైదుమియా, కమలాపురం ప్రసాద్ అనే వ్యక్తులు మద్యం సేవించి పోలీస్ తనిఖీలలో పట్టుబడ్డారని పేర్కొన్నారు. వారిని బద్వేల్ కోర్టులో హాజరు పరచగా జైలు శిక్ష, రూ. 10 వేల జరిమానా విధించిందని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు.

## మైనర్లకు వాహనాలు ఇస్తే కేసు నమోదు చేస్తాం

**ప్రజాశక్తి - పులివెందుల టౌన్**

మైనర్లకు వాహనాలు ఇస్తే జరిమానాలతో పాటు కేసులు నమోదు చేస్తామని పులివెందుల డిఎస్‌పి మురళి నాయక్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం పట్టణంలోని పూలంగల సర్కిల్ వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మైనర్లకు కౌన్సెలింగ్ ఇచ్చి వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. మైనర్ పిల్లలకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్సు తీసుకొని వాహనాలు నడపాలన్నారు. మద్యం సేవించి వాహనం నడపడం ద్వారా ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్నాయని పేర్కొన్నాపరు. వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిఐ హాజీవల్లి , పోలీసులు ఉన్నారు.

# పన్నుల వసూళ్లతోనే అభివృద్ధి సాధ్యం

**- జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి**

**ప్రజాశక్తి - ముద్దనూరు**

పన్నుల వసూళ్లతోనే గ్రామ పంచాయతీల అభివృద్ధి సాధ్యమని జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం డిపిఒ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వమిత్వపై పది రెవెన్యూ గ్రామాల్లో నిర్వహించిన సర్వే వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామ కంఠాలకు, ఇంటి కొలతలు వేసి పన్ను వసూళ్లు చేయాలని సూచించారు. పది రెవెన్యూ గ్రామాల్లోని ప్రతి ఇంటికి 9(2) నోటీసులు అందజేయాలని ఆదేశించారు. ఇంటి పన్నులు త్వరగా వసూలు చేసి, పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. రోజూ చెత్త సేకరించి, పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టి గ్రామ పంచాయతీలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. మండలంలో దాదాపు 4,200 ఇళ్లకు సంబంధించి యజమానుల ఫోన్ నెంబర్లు తప్పుగా నమోదు అయ్యాయన్నారు. ఇంటి యజమానుల ఫోన్ నెంబర్లు రేపటిలోగా సరిచేసి నమోదు చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం తిమ్మాపురం గ్రామంలో పర్యటించి పారిశుధ్య కార్మికులు రోజు ఇంటింటికి తిరిగి చెత్త సేకరిస్తూ, పారిశుధ్యం పనులు చేస్తున్నారా అని గ్రామస్తులతో ఆరా తీశారు. చెత్త సేకరిస్తూ పారిశుధ్య పనులు చేపడుతున్నట్లు గ్రామస్తులు డిపిఒకు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రాధాకృష్ణవేణి, డిప్యూటీ ఎంపిడిఒ వీరభద్రుడు పాల్గొన్నారు.

# రైల్వే బోర్డు ఆమోదం తెలపడం హర్షణీయం

**- పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి**

**ప్రజాశక్తి - వేంపల్లె**



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న తులసిరెడ్డి

ముద్దనూరు- పులివెందుల-ముదిగుబ్బ నూతన బ్రాడ్ గేజ్ రైల్వే లైన్ నిర్మాణానికి రూ 2,056 కోట్ల అంచనాతో 110 కిలోమీటర్ల మేర రైల్వే బోర్డు ఆమోదం తెలపడం హర్షణీయమని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కడప - రాయచోటి - మదనపల్లి - బెంగళూరు నూతన బ్రాడ్ గేజ్ రైల్వే మార్గం మాటేమిటని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను తులసిరెడ్డి ప్రశ్నించారు. రాయలసీమ ప్రాంత రైతులు, వినియోగదారులు, అన్ని వర్గాల ప్రజల సమగ్ర అభివృద్ధి కోసం 2008 -09 రైల్వే బడ్జెట్‌లో నాటి రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు కేంద్రంలోని మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం కడప, రాయచోటి, మదనపల్లి, బెంగళూరు నూతన బ్రాడ్ గేజ్ రైలు మార్గాన్ని మంజూరు చేసిందని పేర్కొన్నారు. రైలు మార్గం పొడవు 255.40 కిలోమీటర్లు కాగా ఇందులో 205 కిలోమీటర్లు ఆంధ్ర ప్రదేశ్‌లో, మిగిలిన 50.40 కిలోమీటర్లు కర్ణాటక రాష్ట్రంలో ఉందన్నారు. నిధులలో 50 శాతం కేంద్ర ప్రభుత్వం ,50 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరించే షరతుతో మంజూరు అయ్యిందని చెప్పారు. 2008 -09 అంచనా మేరకు ప్రాజెక్టు వ్యయం రూ.3038 కోట్లు అన్నారు. 2010 సెప్టెంబర్‌లో అప్పటి రైల్వే మంత్రి మునియప్ప కడప - బెంగళూరు రైల్వే లైన్‌కు శంకుస్థాపన చేశారని చెప్పారు. నాలుగు దశల్లో ప్రాజెక్టు పని పూర్తి చేయాలని ఆదేశాలు ఇచ్చారని చెప్పారు. మొదటి దశలో కడప నుండి పెండ్లిమర్రి వరకు, రెండవ దశలో పెండ్లిమర్రి, లక్కిరెడ్డిపల్లె, రాయచోటి ,వాల్మీకిపురం ,వాయల్పాడు మీదుగా మదనపల్లి వరకు ,మూడవ దశలో మదనపల్లె నుండి ఆంధ్రప్రదేశ్ సరిహద్దు అయిన ములభాగల వరకు, నాలుగవ దశలో ములభాగల నుండి కోలార్ వరకు నిర్మాణం పూర్తయ్యే విధంగా ప్రాజెక్టు రూపకల్పన చేశారని వివరించారు. ఇందులో మొదటి దశలో కడప నుండి పెండ్లిమర్రి వరకు 21.80 కిలోమీటర్ల పని పూర్తయిందని చెప్పారు. అందుకు రూ.351 కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వాటాగా రూ 132. 39 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. రాష్ట్రంలో 2019 మేలో వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుండి రాష్ట్ర ప్రభుత్వ వాటాగా ఇవ్వాల్సిన నిధులు ఇవ్వని కారణంగా రైల్వే శాఖ పనులు నిలిపివేసిందని చెప్పారు. ప్రస్తుతం టిడిపి కూటమి ప్రభుత్వం కూడా రాష్ట్ర వాటాగా ఇవ్వాల్సిన నిధులు ఇవ్వని కారణంగా పనులు జరగడం లేదని మండిపడ్డారు. ఇప్పట ికైనా రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా ఇవ్వాల్సిన నిధులను వెంటనే విడుదల చేసి పెండింగ్‌లో ఉన్న ఉన్న భూసేకరణ పనులు వెంటనే చేపట్టాలని కోరారు. అలాగే రైల్వే శాఖ వెంటనే ప్రాజెక్ట్ పనులు పునః ప్రారంభించేటట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని తులసి రెడ్డి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు అమర్నాథ్ రెడ్డి, తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, ఉత్తన్న, ఐచర్ రమణ, చిన్నకోట్ల నాగరాజు పాల్గొన్నారు.

# వైద్య కళాశాలల్లో ప్రయివేట్ భాగస్వామ్యం వద్దు

**ప్రజాశక్తి -పులివెందుల రూరల్**



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు

వైద్య కళాశాలల ప్రయివేట్ భాగస్వామ్యం విధానాన్ని అడ్డుకునేందుకు అన్ని వర్గాల ప్రజల భాగస్వామ్యంతో ఈనెల 28న ప్రజా ఉద్యమం చేపట్టనున్నట్లు మున్సిపాలిటీ వైసిపి ఇన్‌ఛార్జి వై.ఎస్. మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం భాకరాపురంలోని జగన్ క్యాంప్ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి వైసిపి ప్రజా ఉద్యమం పోస్టర్లు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ కావాలనే పేద ప్రజల కలను నిజం చేసేందుకు జగన్మోహన్ రెడ్డి 17 వైద్య కళాశాలలను నిర్మించారన్నారు. కక్ష సాధింపుతో కూటమి ప్రభుత్వం వారి బినామీ అయిన ప్రయివేటు వ్యక్తులకు అప్పజెప్పడం దుర్మార్గమని వారన్నారు. ప్రజలకు ఉచితంగా అందాల్సిన నాణ్యమైన వైద్యాన్ని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పూర్తిగా ఖూనీ చేసిందని వారన్నారు. వెనకబడిన వర్గాలు వారు అభ్యున్నతి సాధించాలని సంకల్పంతో ఒకవైపు వైద్యం, విద్యను జగన్మోహన్ రెడ్డి తీసుకురావడంతో పాటు, ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పించాలని ఒక మంచి ఉద్దేశంతో ాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టారని చెప్పార. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఒక రాజకీయ కక్షతో, ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రవేటు వ్యక్తులకు కట్టబెడుతున్నారని వారు ఆరోపించారు. ప్రవేటీకరణకు వ్యతిరేకంగాఈ నెల 28న అన్ని వర్గాల ప్రజల భాగస్వామ్యంతో ర్యాలీలు, తహశీల్దార్‌లకు వినతిపత్రాలు అందజేయాలని పిలుపునిచ్చారు. ఈ అంశంపై ఇప్పటికే నిర్వహిస్తున్న సంతకాల సేకరణ కార్యక్రమానికి అన్ని వర్గాల ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోందన్నారు. కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో స్వచ్ఛందంగా పాల్గొని ప్రభుత్వంపై తమ నిరసన తెలియజేస్తున్నారన్నారు. రాష్ట్రంలో వైద్యాన్ని అమ్ముకునేలా చంద్రబాబు పాలన ఉందని ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న వైద్య కళాశాలలను చంద్రబాబు ప్రైవేటుపరం చేస్తున్నారని మండిపడ్డారు. అడ్రస్ లేని కంపెనీలకు విలువైన భూములను కట్టబెడుతున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వ నిర్ణయాలతో రాష్ట్రంలో వైద్య రంగం ఊపిరి తీస్తున్నారని, పిహెచ్‌సి వైద్యుల సమ్మెతో గ్రామాల్లో ప్రజలకు వైద్య సేవలు బంద్ అయ్యాయని, ఆరోగ్యశ్రీ సేవల నిలిపివేతతో కార్పొరేట్ ఆస్పత్రుల్లో పేదలకు వైద్యం అందకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, పట్టణ అధ్యక్షులు గంగాధర్ రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షులు కౌన్సిలర్ పార్నపల్లెకిషోర్, మాజీ చైర్మన్ రసూల్, మాజీ వైస్ చైర్మన్ సర్వోత్తమ రెడ్డి, కౌన్సిలర్ కోడి రమణ, సోషల్ మీడియా ఇన్‌ఛార్జి వివేక్, రిషికేశవరెడ్డి, చంద్రమౌళి, ఫక్రుద్దీన్, కౌన్సిలర్ బొగ్గిటి పురుషోత్తం, కనక, ఫైర్ రామకృష్ణ, రాజశేఖర్, సంపత్, కార్తీక్, వీరారెడ్డి, నూరుల్లా, కోళ్ల భాస్కర్, కో ఆప్షన్ నెంబర్ దాసరి చంద్రమౌళి, నాగరాజు, ఆర్ సి డి ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, శ్రీరాములు, నాయకులు, కార్యకర్తలు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్

## అధికారులు అప్రమత్తంగా ఉండాలి : ఎమ్మెల్యే

**ప్రజాశక్తి - చాపాడు**

ప్రస్తుతం ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నందున అధికారులకు అప్రమత్తంగా ఉంటూ ప్రజలను జాగృతం చేయాలని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ పేర్కొన్నారు. మైదుకూరు మున్సిపాలిటీలో వర్షాలు కారణంగా పరిస్థితిపై మున్సిపాలిటీ కార్యాలయంలో ఎమ్మెల్యే శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో రోజూ చెత్త సేకరణ చేపట్టి పారిశుద్యం సమస్యలు లేకుండా చూడాలని పేర్కొన్నారు. ప్రస్తుత వర్షా కాలంలో నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలని, బ్లీచింగ్ పొడి క్రమం తప్పకుండా చల్లి , అపరిశుభ్ర వాతావరణం లేకుండా చూడాలని ఆదేశించారు. శానిటేషన్ సెక్రటరీల ద్వారా కార్మికులకు రోజు వారీ పనికి సంబంధించి ప్రణాళిక సిద్ధం చేయాలని తెలిపారు. మున్సిపాలిటీలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ కనీస వేతనాలు సలహా కమిటీ డైరెక్టర్ దాసరి బాబు, మార్కెట్ యార్డ్ చైర్మన్ ఎపి రవీంద్ర, మున్సిపాలిటీ కమిషనర్ రంగస్వామి, అసిస్టెంట్ ఇంజినీర్ నిరంజన్ రెడ్డి పాల్గొన్నారు.

## ప్రభుత్వ కార్యాలయాలకు మరమ్మతులు చేయిస్తాం

**ప్రజాశక్తి - వల్లూరు**

మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అగ్రికల్చర్ ఆఫీస్, ఉపాధి, వెలుగు, విద్యాశాఖ కార్యాలయలు మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి పైకప్పులు పెచ్చులు ఊడి వర్షపు నీరు కారుతుండడంతో అధికారులు ఇబ్బంది పడుతున్నారని, ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి మరమ్మతులు చేయిస్తామని కమలాపురం ఎమ్మెల్యే పుత్త కృష్ణ చైతన్యరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రాన్ని, మండల వనరుల కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సేవలు అందించే ప్రతి ప్రభుత్వ కార్యాలయంలోని సమస్యను వెంటనే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీవాణి, ఎంపిడిఒ రఘురాం, డిప్యూటీ ఎంపిడిఒ శ్రీధర్, మండల సొసైటీ చైర్మన్ లేబక నాగేశ్వర్‌రెడ్డి, డాక్టర్ ఫణీంద్ర, మండల టిడిపి నాయకులు మామిళ్ల చెన్నారెడ్డి, మధుసూదన్ రెడ్డి, రమణారెడ్డి, శ్రీధర్ రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.



ప్రభుత్వ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చైతన్యరెడ్డి

## వధూవరులను ఆశీర్వదించిన టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు

**ప్రజాశక్తి - వేముల**

స్థానిక క్రిస్టియన్ కాలనీకి చెందిన టిడిపి సీనియర్ నాయకులు, వేల్పుల సొసైటీ డైరెక్టర్ తొలిసాకు రాము కుమారుడు అజయ్, పూజిత వివాహం శుక్రవారం జరిగింది. టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు పేర్ల పార్థసారధి రెడ్డి, ఆయన సోదరుడు పేర్ల శేషారెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.









విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న అర్బన్ సిఐ రమణారెడ్డి

## సమాజం పట్ల అవగాహన కలిగి ఉండాలి : సిఐ

**ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)**

విద్యార్థి దశ నుంచే సమాజం పట్లఅవగాహన కలిగి ఉండాలని అర్బన్ సిఐ రమణారెడ్డి తెలిపారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని విఆర్ జూనియర్ కళాశాలలో లైంగిక వేధింపుల పట్ల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మహిళల పట్ల లైంగిక వేధింపులు అధికమయ్యాయన్నారు. విద్యార్థి దశ నుంచే వీటిని రూపుమాపేందుకు కృషి చేయాలన్నారు. సెల్ ఫోన్‌కు దూరంగా ఉండాలన్నారు. అంతర్జాలాన్ని విద్యార్థులు అవసరం మేరకు మాత్రమే ఉపయోగించుకోవాలన్నారు. విద్యార్థులు మంచి అలవాట్లను పెంపొందించుకొని వాటిని తల్లిదండ్రులకు, ఇంటి పరిసరాల్లో ఉన్నవారికి తెలియజేయాలన్నారు. ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. మహిళల పట్ల జరుగుతున్న లైంగిక వేధింపుల నివారణ, విద్యార్థుల పాత్ర అంశంపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల కరెస్పాండెంట్ ఎస్ వెంకట్ రాముడు, ప్రిన్సిపల్ తిరుమలేష్ , సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రశ్నిస్తూనే ఉంటా?

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)**




మాట్లాడుతున్న జి.వి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

ప్రొద్దుటూరు ప్రజల కోసం తాను నాయకులను, అధికారులను ప్రశ్నిస్తూ నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల శ్రేయస్సు కోసం అధినాయకత్వానికి విజ్ఞప్తి చేస్తూనే ఉంటానని ప్రొద్దుటూరు టిడిపి మాజీ ఇన్‌ఛార్జి జి.వి. ప్రవీణ్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేకరులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తనను మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి పర్యాయ, వ్యతిరేక అర్థాలతో సంబోధించడం సబబు కాదని హితువు పలికారు. గత ప్రభుత్వ హయాంలో ప్రొద్దుటూరు నియోజకవర్గంలో వైసిపి నాయకులు అసాంఘిక కార్యకలాపాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారారని, నియోజకవర్గంలో జరిగిన అన్ని అసాంఘిక కార్యక్రమాలకు బిగ్ బాస్ మాజీ ఎమ్మెల్యే రాచమల్లు అని ఆరోపించారు. రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచి, గౌరవప్రదంగా ఉండాల్సిన రాచమల్లు తనను పర్యాయపదాలతో పిలవడం దారుణమని, త్వరలో మాజీ ఎమ్మెల్యే రాచమల్లు చీకటి బాగోతాలు బయట పెడతానని చెప్పారు. మహర్షి స్కూల్, డిఎడబ్ల్యూ మహిళ కళాశాల విషయంలో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేస్తానన్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ఇప్పుడు స్తబ్ధుగా ఉండటానికి కారణమేంటని ప్రశ్నించారు. దాతలు విద్యాసంస్థల కోసం దానం చేసిన భూములను రాచమల్లు అనుచరులు కాజేసారని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ఏర్పాటు చేస్తున్న ప్రతి పాత్రికేయుల సమావేశాలలో పోలీసు వ్యవస్థపై ఆరోపణలు చేయటం ఆనవాయితీగా మారిందని, గత ప్రభుత్వ హయాంలో కన్నా ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో పోలీసు వ్యవస్థ 60 శాతం మేరకు మార్పు చెందిందని చెప్పారు. చీకటి ఒప్పందాలు చేసుకొని అందుకు పోలీసులు సహకరించకపోవడం వల్లనే రాచమల్లు పోలీస్ వ్యవస్థపై ఆరోపణలు గుప్పిస్తున్నారని అభిప్రాయపడ్డారు .నియోజకవర్గంలో ఎక్కడ అసాంఘిక కార్యక్రమాలు జరిగినా ఎస్‌పికి, ప్రొద్దుటూరు డిఎస్‌పికి రాచమల్లు ఎందుకు ఫిర్యాదు చేయడం లేదని ప్రశ్నించారు. గడచిన ఎన్నికలలో రాచమల్లు ఎందుకు ఓటమి చవిచూశారో ఒకసారి ఆత్మ పరిశీలన చేసుకోవాలని, ప్రతిపక్షంలో కూడా లేని వైసిపి పార్టీ, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రజలకు అవసరమా అని వ్యంగంగా మాట్లాడారు.



స్కౌట్ విద్యార్థులతో ఎస్ఐ తిరుపాల్‌నాయక్

## స్కౌట్స్‌తో విద్యార్థుల్లో ఉత్తమ గుణాలు

**ప్రజాశక్తి - వేంపల్లె**

స్కౌట్స్ ఉద్యమంతో యవతలో దేశభక్తి, క్రమశిక్షణ, సామాజిక సేవా లాంటి ఉత్తమ గుణాలు పెంపొందిస్తాయని ఎస్ఐ తిరుపాల్ నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో స్కౌట్స్ విభాగానికి ఎంపికైన 26 మంది విద్యార్థులకు ఎస్ఐ చేతుల మీదుగా స్కౌట్ యూనిఫామ్‌ను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కౌట్స్ అనేది రాజీకీయేతర, విద్య సంబంధిత అన్నారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, సహస స్ఫూర్తి అనేది ఉంటుందని చెప్పారు. సేవా తత్పరతను ప్రతి విద్యార్థి కలిగి ఉండాలని కోరారు. అలాగే నేటి సమాజంలో జరుగుతున్న అకృత్యాల నిర్మూలనలో విద్యార్థులు తమ వంతు పాత్ర పోషించాలని సూచించారు. స్కౌట్స్‌లో చేరిన విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలని కోరారు. అనంతరం పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా విద్యార్థులకు మహిళాలు, పిల్లలపై జరిగే లైంగిక దాడులను అరికట్టడంలో విద్యార్థుల పాత్రపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శివ మునెమ్మ, ఉపాధ్యాయులు గోపాల్ నాయక్, వెంకట మోహన్, మహబూబ్ బాషా, కిరణ్, ధర్మారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.